క్లుప్తంగా

చిత్రలేఖనం పోటీల్లో 'సుమేధ' విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: గుజరాత్‌కు చెందిన రెయిన్‌బో ఆర్ట్ అకాడమీ గత నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో సుమేధ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎన్జీవో కాలనీలోని పాఠశాలలో మంగళవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చిత్రలేఖనం పోటీల్లో తమ విద్యార్థులు 29 బంగారు, 24 రజత, 13 కాంస్య పతకాలతో మొత్తం 66 బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి అత్యధిక మంది విద్యార్థులు పాల్గొనే విధంగా ప్రోత్సహించిన మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డిని చిత్రలేఖనం పోటీల నిర్వాహకులు కళారత్న అవార్డుతో సత్కరించారు. బహుమతులు గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లాంగ్వేజ్ పండిట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఈవో శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం లాంగ్వేజ్ పండిట్ పరీక్షా కేంద్రాన్ని డీఈవో పి.శైలజ సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షలు జరుగుతున్న తీరును ఆమె పరిశీలించారు. ఈ నెల 28 వరకు జరిగే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్, శాఖాధికారికి సూచించారు. బోయపాలెంలోని డైట్ కళాశాలలో జరుగుతున్న డీఎడ్ సెమిస్టర్-1 పరీక్షల తీరును ప్రభుత్వ పరీక్షల విభాగ సహాయ కమిషనర్ కె.వెంకటరెడ్డి పరిశీలించారు. డీఎడ్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

పాత గుంటూరు: సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు 7వ లైనులోని సీతారామస్వామి ఆలయంలో మందిరం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహదాశీర్వచనం, ఆచార్య సంభావనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మందిర సొసైటీ అధ్యక్షుడు కె.సాంబశివరావు, కార్యదర్శి కల్లి సుందరరామిరెడ్డి, సభ్యులు కల్లి శ్రీనివాసరెడ్డి, ఎం.నరసింహారావు, లింగంటి జయలక్ష్మి, భావనాకృష్ణ, ఎస్.కోదండరామిరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

హక్కులకు భంగం కలిగించరాదు

నెహ్రూనగర్: బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్-13 సూపర్‌వైజర్ ఎం.సుబ్బమ్మ పేర్కొన్నారు. మంగళవారం కొండ వెంకటప్పయ్య కాలనీలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో వివిధ దశల్లో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న అసమానతలు రూపుమాపేందుకు ఈ అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కేఎస్ఆర్‌టీ మున్సిపల్ కార్పొరేషన్ హెచ్‌ఎం పి.రమేష్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం థామస్‌రెడ్డి, అడ్వకసీ కో-ఆర్డినేటర్ జి.వెంకయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరుఈస్ట్: ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసి గాయపరిచిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. శారదా కాలనీకి చెందిన మేకల రోశయ్య ఈ నెల 16వ తేదీ చంద్రమౌళీనగర్‌లో వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి రాడ్డుతో కొట్టి గాయపరిచి పరారయ్యాడు. పాతకక్షల నేపథ్యంలో నీలం రవికిరణ్ తనపై దాడి చేయించాడని ఫిర్యాదులో రోశయ్య పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబర్ ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గుజ్జనగుండ్లలో బత్తుల గోపీనాథ్ అనే వ్యక్తి సింగిల్ నంబర్ ఆట నిర్వహిస్తున్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడి చేశారు. గోపీనాథ్‌ను స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.4,300 నగదు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26న గురవయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు ఎడ్యుకేషన్: మాజేటి గురవయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు పాఠశాల పూర్వ విద్యార్థి, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ తెలిపారు. బ్రాడీపేటలోని పాఠశాలలో మంగళవారం ఆయన మాట్లాడారు. గురువారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో సమ్మేళనం జరుగుతుందన్నారు.

గాంధీ పార్కును త్వరగా అందుబాటులోకి తేవాలి



గాంధీ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గాంధీ పార్క్ అభివృద్ధి పనులు వేగంగా నిర్వహించాలని, ఫిబ్రవరి నెలఖారుకు పార్క్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కాంట్రాక్టర్లకు నిర్దేశిత గడువును విధించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి నగరపాలక సంస్థ ఎస్ఈని ఆదేశించారు. మంగళవారం గాంధీ పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పార్క్ పనుల పురోగతిపై ఎస్ఈ, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటివరకు పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ప్లే ఎక్విప్మెంట్స్, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారన్నారు. మెయిన్ గేటు ఆర్చి పనులు కూడా వేగంగా జరుగుతున్నా, అంతర్గత గ్రానైట్ పరచడం పనులు మందకొడిగా సాగుతున్నాయని, అదనపు కార్మికులను ఏర్పాటు చేసుకొని, పనులను త్వరితగతిన చేపట్టాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. డైనోసార్‌లో థియేటర్ పనులు కూడా ప్రారంభించాలని, పనులు జరిగిన ప్రాంతాల్లో లాన్ వేయడానికి చర్యలు తీసుకోవాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. మెయిన్ గేటులో నుంచి పార్క్ లోపలికి వచ్చే మార్గంలో రోజ్ గార్డెన్, లాన్‌ను ఆకర్షణీయంగా తయారు చేయాలని, పార్క్‌లో సెల్ఫీ పాయింట్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్, స్టాల్స్, మరుగుదొడ్ల ఏర్పాటు పక్కాగా ఉండాలన్నారు. పార్క్ అభివృద్ధి పనుల పురోగతిపై రోజు సమీక్షిస్తామని, ఎప్పటికప్పుడు నిర్దేశిత గడువులోగా పనులు జరిగేలా ఎస్ఈ, ఈఈలు నేరుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, కళ్యాణరావు, ఏడీహెచ్ రామారావు, ఏఈ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ షమ సుల్తానా, ప్రిన్సిపాల్ రజని

గుంటూరు మెడికల్: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని హోప్ విన్ హాస్పటల్స్ సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ షమ సుల్తానా అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సోమవారం యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్ విన్ హాస్పటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సంగడిగుంటలోని ఏపీ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఉచితంగా రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేసి రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ షమ సుల్తానా వివరించారు. రక్తహీనత రాకుండా మందులు అందించి అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐరన్ ఎక్కువగా ఆహారంలో లేకపోవడం వల్ల రక్తహీనత ఏర్పడుతోందని, రక్తహీనత ద్వారా పుట్టబోయే బిడ్డను, లేదా, తల్లిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. బాలికలు దీన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాల దశలోనే రక్తహీనత రాకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజని, హోప్ విన్ హాస్పటల్స్ మేనేజర్ పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు మృతి

లక్ష్మీపురం: మంగళగిరి రైల్వే బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్ పక్క వృద్ధురాలు మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి రైలు పట్టాల వద్ద సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధురాలిని గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాస్‌కు సమాచారం అందింది. పరిసర ప్రాంతాల వారిని మృతురాలి వివరాలపై విచారించగా తెలియదని చెప్పడంతో రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. మృతురాలు ఎర్రరంగు చీర, ఆకు పచ్చ రంగు జాకెట్, మెడలో పసుపు తాడుతో ఉన్నట్లు గుర్తించారు.

బహుమతులు ప్రదానం

గుంటూరు మెడికల్: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు మంగళవారం జాయింట్ కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో గుంటూరు ఎస్‌జేఆర్ఆర్ ఎంసీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థి డి.హేమమణికంఠ, వక్తృత్వ పోటీలో ఎస్ఎంకేపీఎస్‌కేహెచ్ జీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి మైరా రఫత్, చిత్రలేఖనం పోటీలో ఇదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి బి.సాహిత్య ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. కాకాని జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థిని కె.కోమలి వ్యాసరచన పోటీల్లో ద్వితీయ బహుమతి, ఇదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సీహెచ్ అను వక్తృత్వ పోటీల్లో ద్వితీయ బహుమతి, నల్లపాడు జెడ్పీహెచ్ఎస్ 9వ తరగతి చదువుతున్న ఎం.శ్రావణి చిత్రలేఖనం పోటీల్లో ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ప్రథమ బహుమతి సాధించిన వారికి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు చొప్పున జాయింట్ కలెక్టర్ రాజకుమారి నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె.హనుమంతరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, డాక్టర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పండుగ మహోత్సవాలు ప్రారంభం

పెదకాకాని: యేసు పవిత్ర హృదయ పుణ్యక్షేత్రం మూడు రోజుల పండుగ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నంబూరు విజయభాస్కర్‌నగర్‌లో ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పండుగ మహోత్సవాన్ని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ సాంప్రదాయ బద్ధంగా ప్రారంభించారు. చర్చిలో ఫాదర్ నవీన్ ఆశీస్సులు తీసుకున్నారు.

'సూట్స్‌కేర్' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపించడం లేదని, దీనివల్ల అనర్థాలు ఎదుర్కోవాల్సివస్తోందని సూట్స్‌కేర్ నెట్‌వర్క్ అకడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కొత్తమాసు అన్నారు. సోమవారం బ్రాడీపేటలోని రాపిడో బైక్ ట్యాక్సీ కార్యాలయంలో సూట్స్‌కేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ మాట్లాడుతూ రాపిడోలో పనిచేస్తున్న కెప్టెన్‌లకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నామన్నారు. రాపిడో బైక్ ట్యాక్సీ మేనేజర్ రాజీవ్‌నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా ఎక్కువ మంది బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. కెప్టెన్‌లకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి వైద్య సేవలు అందించిన సూట్స్‌కేర్ నెట్‌వర్క్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సూట్స్‌కేర్ నెట్‌వర్క్ ఐసీఈ ప్రాజెక్టు డైరెక్టర్ లలిత్ ప్రజాపతి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తమ సంస్థ అందరికి అందుబాటులో వైద్యం అనే నినాదంతో పనిచేస్తోందన్నారు. అనేక విద్యా సంస్థలతో ఒప్పందం చేసుకుని ఉచిత వైద్య పరీక్షలు చేసి వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు లోకేష్, కార్తీక్, భారతి, నిహారిక, ర్యాపిడో బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఆనంద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక వ్యవసాయ రంగం



సావనీర్ విడుదల చేస్తున్న జితేంద్రకుమార్, కామేశ్వరశాస్త్రి, శ్రీనివాసబాబు, అనితాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: వ్యవసాయ రంగం భారత దేశానికి వెన్నెముక వంటిదని గాడ్రేజ్ ఫిలిప్స్ ఇండియా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జితేంద్రకుమార్ అన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో భారతీయ సాంఘిక శాస్త్రాల పరిశోధన మండలి (ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహాయంతో 'సాధికార భారతదేశం-75 ఏళ్ల విజయాలు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ తెల్లాకుల శ్రీనివాసబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా జితేంద్రకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందు ఆహార ధాన్యాల కొరత ఎదుర్కొన్న భారతదేశం ప్రస్తుతం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో మిగులుబాటు సాధించిందని తెలిపారు. వ్యవసాయ రంగం పునరుజ్జీవానికి తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యార్థులకు విశదీకరించారు. ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి మరింత ప్రాధాన్యతనిచ్చి రైతుల సమస్యలు పరిష్కరించగలిగితే భారతదేశం అతి తక్కువ సమయంలోనే అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయం, గ్రామీణ మార్కెటింగ్ రంగాలను సాంకేతికతతో అనుసంధానించినప్పుడే ఆశించిన ఫలితాలను అందుకోగలమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి మాట్లాడుతూ జాతీయ సదస్సు బుధవారం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పరిశోధన పత్రాలు సమర్పించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రవికుమార్, డాక్టర్ నాగనిర్మలారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న వల్లే సామాజిక న్యాయం

- ప్రతి కులానికీ రాజ్యాధికారం ఘనత ఆయనదే
- రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

తాడికొండ: సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతోందని, ప్రతి కులానికీ రాజ్యాధికారం అందించిన ఘనత ఆయనదేనని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్లు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మర్రి రాజశేఖర్ చెప్పారు. మంగళవారం తాడికొండ అడ్డరోడ్డులోని జీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన పార్టీ తాడికొండ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి వీరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్య, వైద్య రంగాలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. బలహీన వర్గాలకు ప్రాధాన్యమిస్తూ దేశానికే ఆదర్శంగా అందిస్తున్నారని కొనియాడారు. పార్టీ పటిష్టతకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. జన సంక్షేమంలో దేశంలోనే ఏపీ ముందుందని, పిల్లల చదువు కోసం, జన ఆరోగ్యం కోసం పెట్టే ఖర్చు వృథా కాదని, వారి భవిష్యత్తుకు పెట్టుబడి అవుతుందని నమ్మిన జగనన్న విద్యా, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారని గుర్తుచేశారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలన్నారు. కరోనా వైరస్ మహమ్మారి వల్ల వచ్చిన సంక్షోభంలోనూ గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటికే పాలన తీసుకొచ్చి అండగా నిలిచిన జగనన్నకు ప్రజలు అంతే అండగా నిలుస్తారనడంలో సందేహం లేదన్నారు. 2024 ఎన్నికల్లో 175కి 175 సీట్లు సాధించే లక్ష్యంతో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై, వైఎస్సార్ సీపీపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేసే ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో తాడికొండ నియోజకవర్గం నుంచే మొదటి విజయం ప్రారంభం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని గ్రామాల కార్యకర్తలు నాయకులతో ఓపికగా మాట్లాడిన రీజినల్ కో-ఆర్డినేటర్‌లు తమ దృష్టికి వారు తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఆషా సజని



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కె.ఆషాసజనిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కె.వెంకటతులశమ్మను కర్నూలు జీజీహెచ్‌కు, కర్నూలులో పనిచేస్తున్న ఆషాసజనిని గుంటూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళతో అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

పట్నంబజారు: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీజీహెచ్‌లో షేక్ మున్ని అనే మహిళ సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో మంగళవారం జీజీహెచ్‌కు వచ్చిన దేవరపల్లి మార్తయ్య షేక్ మున్నితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య ఆర్.శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఇండియన్ కాపిటల్ మార్కెట్' అనే అంశంపై ఫిబ్రవరి 24, 25 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, బిజినెస్ రంగ సంస్థలకు చెందిన నిపుణులు హాజరుకానున్నారని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, అధ్యాపకులు డాక్టర్ రతనకిషోర్, డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ విష్ణు, డాక్టర్ సుధీర్, డాక్టర్ భాను చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకనామిక్స్ విభాగంలో..

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ '75 ఏళ్ల భారత ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక అభివృద్ధి, సమన్యాయం' అనే అంశంపై మార్చి 9, 10 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ సదస్సుకు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను మార్చి 5వ తేదీలోగా అందజేయాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వర్సిటీ పాలకమండలి సభ్యులు, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య సరస్వతిరాజ్ అయ్యర్, ఎకనామిక్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు

ఎమ్మెల్యే మద్దాళిగిరి



మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దాళిగిరి, పూర్ణిమ దంపతులు

పట్నంబజారు: పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళిగిరిధర్ చెప్పారు. మంగళవారం ఆర్.అగ్రహారంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో అర్బన్ బ్యాంకు డైరెక్టర్ రాయవరపు అశోక్‌కుమార్ నేతృత్వంలో బీటెక్ చదువుతున్న పేద విద్యార్థినికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాకూడదన్నారు. సమాజంలో సాటివారికి సాయం అందించాలన్న దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలను ఎమ్మెల్యే గిరి, ఆయన సతీమణి పూర్ణిమ దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

డ్రైన్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

నెహ్రూనగర్: రోడ్ల విస్తరణ పూర్తయిన ప్రాంతాల్లో డ్రైన్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని, అందుకు తగిన విధంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, సీపీడీసీఎల్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో ఇంజినీరింగ్ అధికారులు, సీపీడీసీఎల్, ఆర్అండ్‌బీ అధికారులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇతర శాఖలతో సమన్వయంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెద్దపలకలూరురోడ్డు, కుగ్లర్ హాస్పిటల్ రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయని, డ్రైన్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రైన్ల నిర్మాణం పూర్తయిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సీపీడీసీఎల్ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ రిజర్వాయర్లకు ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటుకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా నగరంలోని పబ్లిక్ టాయిలెట్లకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని, టెండర్ పొంది వర్క్ అగ్రిమెంట్ అయిన పనులు వేగంగా జరిగేలా చూడాలని ఏఈలను ఆదేశించారు. పూర్తి చేసిన పనులకు బిల్లుల చెల్లింపునకు ప్రాసెస్ చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందరరామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసబాబు, నగరపాలక సంస్థ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మేయర్ కావటి, కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: వేసవిలో గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం గుంటూరు నగరంలోని ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసే సంగం జాగర్లమూడి వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. పర్యటనలో తొలుత జాగర్లమూడి ప్లాంట్ నుంచి ఎంత వాటర్ ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్‌కు సరఫరా అగుతుంది? తాగునీటి సరఫరా సమయాలు, క్లోరినేషన్ వంటి వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగం జాగర్లమూడిలోని రిజర్వాయర్‌ను 1948లో నిర్మాణం ప్రారంభించి 1956లో వినియోగంలోకి తెచ్చారన్నారు. ఇంజినీరింగ్ అధికారులు తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. లీకేజీలు ఏమైనా ఏర్పడి ఉంటే వెంటనే మరమ్మతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నూతన ప్లాంట్ ద్వారా 25 మిలియన్ లీటర్లు పర్ డే (ఎంఎల్‌డీ) తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. పాతప్లాంట్‌ను కూడా వినియోగంలోకి తెస్తే మరో 25 ఎంఎల్‌డీ తాగునీరు అందుబాటులోకి వస్తాయన్నారు.

బాలికల సంరక్షణ ఇంటి నుంచే మొదలవ్వాలి

ప్రభుత్వ మహిళా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి



వావిలాల లీలా మహేశ్వరిని సత్కరిస్తున్న నిర్మలాకుమారి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: బాలికల సంరక్షణ ఇంటి నుంచే మొదలవ్వాలని ప్రభుత్వ మహిళా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని మహిళా కళాశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ సమాజంలో రక్షణ లేని పరిస్థితులను అధిగమించేందుకు బాలికలు విద్యావంతులుగా ఎదగడమే మార్గమన్నారు. ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. లింగభేదం అనేది ఇంట్లో పుట్టుక నుంచే మొదలవుతుందని, ఇంటి నుంచి మార్పు మొదలైతేనే స్త్రీకి రక్షణ ఏర్పడుతుందన్నారు. ఆడపిల్లలకు సమాజంలోనే కాకుండా సొంత వారి నుంచి రక్షణ కరువు అవుతోందని, బాలికలు, మహిళల రక్షణ లేని పరిస్థితుల్లో ప్రభుత్వం పోక్సో చట్టం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా వావిలాల సంస్థ కార్యదర్శి వావిలాల లీలా మహేశ్వరిని సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల స్త్రీ సాధికారతా విభాగ కన్వీనర్ డాక్టర్ పి.విజయలక్ష్మి, అధ్యాపకులు కమల కరుణ, డాక్టర్ భవాని, ప్రమీల, విజయలక్ష్మి, ధాత్రికుమారి, కృపావాణి పాల్గొన్నారు.

బహిరంగ పత్రికా ప్రకటన

మా కస్టమర్ అయిన గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, వెల్లలూరు గ్రామ కాపురస్తుడు అయిన యడం [illegible], S/o. వెంకటేశ్వర్లు, [illegible], వయస్సు 58 సం॥లు. వ్యవసాయము అనుమతను మా యొక్క బ్యాంకులో హౌసింగ్ లోన్ కొరకు దరఖాస్తు చేయగా [illegible] మా బ్యాంకుకు మార్టుగేజ్ చేసియున్నారు. సదరు మార్టుగేజ్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4545/2022, తేది.08.12.2022 [illegible] చేసియున్నారు.

[illegible]

షెడ్యూలు : గుంటూరు డి.., చేబ్రోలు సబ్.డి.., వెల్లలూరు గ్రామ పంచాయతీ ఏరియా, వెల్లలూరు గ్రామము స.నెం. 158/1, 290.4 చ.గ.లు లేదా 243.93 చ.మీ., [illegible] 0.09 సెంట్లు [illegible]. తూర్పు : [illegible]. దక్షిణం: [illegible]. పడమర: [illegible]. ఉత్తరం: [illegible]. ఈ హద్దుల మధ్య 290.4 చ.గ.లు లేక 243.93 చ.మీ.ల [illegible].

పొన్నూరు,
తేది. 24.01.2023

ఇట్లు : మేనేజరు,
కెనరా బ్యాంకు, పొన్నూరు శాఖ.